క్లుప్తంగా

ఆర్డీటీ క్యాంప్ జట్టు విజయం


టీ-20 మ్యాచ్ జరుగుతున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన టీ-20 క్రికెట్ పోటీల్లో ఆర్డీటీ క్యాంప్ జట్టు ఎలైన్ జట్టుపై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎలైన్ జట్టు 20 ఓవర్లకు 167 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఆర్డీటీ క్యాంప్ జట్టు 20 ఓవర్లలో 168 పరుగుతో విజయం సాధించింది. ఇందులో సాయి ప్రణీత్ 99 పరుగులతో సత్తాచాటాడు.

సీఎం సహాయనిధికి పూర్వ విద్యార్థుల విరాళం


సీఎం సహాయనిధికి డబ్బు పంపినట్లు చూపుతున్న పూర్వ విద్యార్థులు

బత్తలపల్లి: వరద బాధితులను ఆదుకునేందుకు బత్తలపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో 2001 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు సీఎం సహాయ నిధికి రూ.10 వేలు విరాళం పంపారు. ఆదివారం బత్తలపల్లిలో పూర్వ విద్యార్థులు కలిసి పై మొత్తం సేకరించారు. అనంతరం ఆన్‌లైన్ ద్వారా ఏపీ సీఎం డిజాస్టర్ రిలీఫ్ ఫండ్‌కు పంపించారు. ప్రతి ఒక్కరూ వరద బాధితులను మానవత్వంతో ఆదుకోవాలని వారు కోరారు.

నేడు శాంతి ర్యాలీ

కదిరి అర్బన్: మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని సోమవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ మేరకు మిలాద్ కమిటీ కార్యదర్శి మగ్బుల్ అలీఖాన్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ర్యాలీ ఉదయం 9-30 గంటలకు అనిమియా మసీదు వద్ద నుంచి ప్రారంభమై నానాదర్గా, ఇక్బాల్‌రోడ్, మెయిన్ రోడ్, బైపాస్ రోడ్డు మీదుగా అనిమియా మసీదు వద్ద ముగుస్తుందని తెలిపారు. ప్రజలంతా శాంతి ర్యాలీలో పాల్గొనాలని కోరారు. అలాగే అనిమియా మసీదు వద్ద మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నబీస్వామి ఉరుసు


విద్యుద్దీపాల అలంకరణలో నబీస్వామి దర్గా

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీపరిధిలోని 17వ వార్డు బీడుపల్లిలో ఆదివారం నబీస్వామి ఉరుసును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉరుసుని పురస్కరించుకుని దర్గాలను రంగురంగుల పూలు, విద్యుద్దీపాలతో అలకరించారు. సాయంత్రం దేశ్‌ముఖ్ ఇంటి నుంచి గంధంను ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. రాత్రి ముస్లిం మతపెద్దలు ఖురాన్ సారాంశాన్ని వివరించారు. ఈసందర్భంగా హిందూ ముస్లింలు దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామిని దర్శించుకొంటే సకల పాపాలు తొలగి మంచి జరుతుందని, కోరికలు నెరవేరుతాయని గ్రామస్తుల నమ్మకం. ఉరుసు సందర్భంగా గ్రామంలో వివిధ అంగళ్లు వెలిశాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది.

వృద్ధులకు అన్నదానం

ధర్మవరం రూరల్: గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులకు, అనాథలకు ఆదివారం సమాచార హక్కు ప్రజా సంరక్షణ వేదిక సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కల్లుట్ల గోపి, జిల్లా కోశాధికారి బీరే క్రిష్ణమూర్తి, సెక్రటరీ నూర్ అహమ్మద్, గౌరవాధ్యక్షుడు ఈశ్వరయ్య, ధర్మవరం అధ్యక్షుడు సోలిగాళ్ల కొండన్న, చెన్న ఆదినారాయణ, సభ్యులు దాసరి నాగేంద్ర, వేణు, బాలాజీ, సుబ్రమణ్యం, నసీంఖాన్, సాయి, ముని, మున్వర్‌బాష, అయూబ్‌ఖాన్, చాంద్‌బాషా, షామీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం


విద్యార్థినికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

తనకల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థిని అక్షయకు నల్లచెరువుకు చెందిన పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందజేశారు. ఈతోడు గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని అక్షయ ఇంటర్ చదువుతోంది. ఇటీవల తన అవ్వ రాజమ్మతో కలిసి ఆటోలో తనకల్లుకు వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం రూ.12,400 నగదును విద్యార్థినికి అందజేశారు.

మంత్రి వ్యాఖ్యలు విడ్డూరం



వైఎస్ జగన్ హయాంలో చేపట్టిన మెడికల్ కాలేజీల నిర్మాణాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయి. రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలన్న లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా మెడికల్ కళాశాలలను తీసుకొని వచ్చి వాటి నిర్మాణాలు కూడా పూర్తి చేశారు. ప్రస్తుతం వాటికి మంజూరు చేసిన సీట్లను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని చూడటం దుర్మార్గం. పులివెందుల వైద్య కళాశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మంజూరు చేసిన 50 ఎంబీబీఎస్ సీట్లను వదులుకోకూడదు.

– సురేష్, బద్దలాపురం, కనగానపల్లి మండలం



మెడికల్ సీట్లు వదులుకోవడం హేయం



రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా 17 మెడికల్ కళాశాలలు స్థాపించేందుకు గత సీఎం వైఎస్ జగన్ ఏర్పాట్లు చేశారు. వాటిలో ఐదింటిని పూర్తి చేయడం జరిగింది. వీటిలో 750 మెడికల్ సీట్లు తీసుకొచ్చిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. మళ్లీ వైఎస్ జగన్ సీఎంగా గెలిచి ఉంటే ఈ విద్యా సంవత్సరంలో పాడేరు, మర్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని వైద్య కళాశాలలు కూడా ప్రారంభమయ్యేవి. మరో 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండేది. అలాంటి గొప్ప వ్యక్తి గురించి మాట్లాడే అర్హత ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు లేదు. ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణలో కూటమి ప్రభుత్వం విఫలమైంది.

– తలారి నవీన్, యలకుంట్ల, కనగానపల్లి మండలం

కదిరి కొండ.. కంపే నిండా!

- కొండ ప్రదేశంలో కోళ్ల వ్యర్థాలు
- ఆ దారిన వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే

కదిరి అర్బన్: కదిరి కొండ ఎంతో ప్రాశస్త్యం ఉన్న ప్రదేశం. సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు పాదం మోపిన ప్రదేశం. ఇప్పటికీ శ్రీమహావిష్ణువు పాదం మోపిన గుర్తులు ఆ కొండలో ఉన్నాయి. అలాంటి పుణ్య ప్రదేశాన్ని కొందరు కోళ్ల వ్యర్థాలతో కలుషితం చేస్తున్నారు. తగిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లిప్తంగా ఉన్నారు. ఫలితంగా పవిత్ర ప్రదేశం కాస్త అపవిత్రంగా మారుతోంది. ప్రధానంగా కదిరి, కుమ్మరవాండ్లపల్లి నుంచి చికెన్ వ్యాపారులు పెద్ద ఎత్తున కోళ్లవ్యర్థాలను కదిరి-రాయచోటి రహదారి పక్కన కదిరి కొండ ప్రదేశంలో పడేస్తున్నారు. దీంతో ఆ కొండ పరిసరాలంతా దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఆ దారి వెంట ప్రయాణించాలంటే ముక్కులు మూసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

తరచూ రోడ్డు ప్రమాదాలు..

కోళ్ల వర్థాలను తినేందుకు శునకాలు పెద్దసంఖ్యలో అక్కడ సంచరిస్తున్నాయి. వీటితో చాలామంది ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారు. కుక్కలు వ్యర్థాల కోసం ఎగబడుతూ అడ్డదిడ్డంగా రోడ్డుపైకి రావడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడ్డారు. ఈక్రమంలో కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారు. వీటితో పాటు మందుబాబులు కొండ పరిసరాల్లో మద్యం సేవించి అక్కడే బాటిళ్లను పగులగొడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కొండ ప్రదేశంలో ఎలాంటి వ్యర్థాలు వేయకుండా గట్టి చర్యలు తీసుకోవడం ద్వారా కొండ ప్రాశస్త్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


కదిరి కొండ వద్ద కోళ్ల వ్యర్థాలను పడేసిన దృశ్యం

ఆ దారి వెంబడి వెళ్లాలంటే భయమేస్తుంది



రాత్రిపూట కదిరి కొండవద్ద ద్విచక్రవాహనంలో వెళ్లాలంటే భయమేస్తుంది. కుక్కలు కోళ్ల వ్యర్థాలను తింటూ రోడ్డుపైకి వస్తున్నాయి. దీంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. ఎంతో పవిత్రత ఉన్న కదిరి కొండను కొందరు అపరిశుభ్రం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– సాంబశివ కదిరి

వ్యర్థాలు వేస్తోంది మున్సిపల్ సిబ్బందే

కదిరి కొండ కింద వర్థాలను వేస్తున్నదీ మున్సిపాల్టీ సిబ్బందే. కుమ్మరవాండ్లపల్లిలో చికెన్ సెంటర్లు లేవు. అన్నీ కదిరిలోనే ఉన్నాయి. చెత్తమాటున చికెట్ వర్థాలన్నీ వేస్తున్నారు. మా గ్రీన్ అంబాసిడర్లు ఒకసారి నిలదీస్తే మరికొంత దూరం వెళ్లి వేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు జేసీబీ పెట్టి క్లీన్ చేశాం. మళ్లీ వేస్తున్నారు. మీ సిబ్బందే ఇలా చేస్తున్నారని ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్‌కు లేఖద్వారా విన్నవిస్తాం.

– పద్మజ, పంచాయతీ సెక్రటరీ కుమ్మరవాండ్లపల్లి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడిన మహమ్మద్ మాజ్

ధర్మవరం అర్బన్: పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కూలి పని చేసే ఎల్లమ్మ ఆదివారం రాత్రి కళాజ్యోతి సర్కిల్ నుంచి గాంధీనగర్‌కు నడుచుకుంటూ వెళుతుండగా అదే రూట్‌లో వెళ్లే ఒక టూవీలర్ సితార హోటల్ వద్ద ఎల్లమ్మను వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ఎల్లమ్మ ఎడమ కాలుకు తీవ్రమైన గాయమైంది. స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా పట్టణంలోని మార్కెట్‌వీధికి చెందిన బంగారు షాపు నిర్వాహకుడు మహమ్మద్ మాజ్ పట్టణంలోని శ్మశాన వాటిక సమీపంలో రహదారిపై ఉన్న గుంత పూడుస్తూ ఉండగా కదిరిగేటు నుంచి ధర్మవరం టౌన్‌లోకి వస్తున్న ఒక టూవీలర్ మహమ్మద్ మాజ్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మహమ్మద్‌మాజ్ తలకు తీవ్రగాయమైంది. అక్కడే ఉన్న అతని స్నేహితులు సాదిక్, జాకీర్, ఆఫన్, వసీంలు క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కదిరి డీఎస్పీగా శివనారాయణ స్వామి



కదిరి టౌన్: కదిరి డీఎస్పీగా జె.శివనారాయణ స్వామి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమల రావు ఉత్తర్వులు జారీ చేశారు. శివనారాయణ స్వామి ప్రస్తుతం కర్నూలు జిల్లాలో ఏసీబీ డీఎస్పీగా పని చేస్తున్నారు. ఇక్కడ పని చేస్తున్న డీఎస్పీ శ్రీలతను తిరుపతి మహిళా డీఎస్పీగా నియమించారు.

శాంతి కమిటీ సమావేశం


ముస్లిం మతపెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

కదిరి అర్బన్: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం డీఎస్పీ శ్రీలత ముస్లిం మతపెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్‌ఉన్ నబీ పండుగ సందర్భంగా సోమవారం జరిగే ర్యాలీకి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో పట్టణ సీఐ నారాయణరెడ్డి, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్


పోలీస్‌స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

ముదిగుబ్బ: మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆదివారం సీజ్ చేసినట్లు సీఐ యతీంద్ర తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు నుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఇసుక తరలిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సాహితీ సాంస్కృతిక సమ్మేళనం

గోరంట్ల: స్థానిక ఎస్‌పీవీయం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం మండల సాహితీ, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్న ప్రముఖులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో విశేష కృషి చేసిన పలువురిని సన్మానించారు.

ప్రజా పోరాటయోధుడు సీతారాం ఏచూరి

కదిరి టౌన్: చివరి శ్వాస వరకూ ప్రజల కోసం ఉద్యమాలు చేసిన పోరాటయోధుడు సీతారం ఏచూరి అని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో ఆదివారంసీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, జనసేన నాయకులు బ్లూమూన్ శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, కాంగ్రెస్ నాయకులు కదిరప్ప, లాయర్ నరసింహులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే పోరుబాటను ఎంచుకున్నారన్నారు. తన తుది శ్వాస వదిలే వరకు ప్రజల కోసం పోరాడారని గుర్తు చేశారు.భారతదేశ రాజకీయాల్లో మచ్చలేని నాయకుడిగా, ప్రజల స్వరాన్ని చట్టసభల్లో తనదైన శైలిలో వినిపించడం ఆయనకున్న ప్రత్యేకత అన్నారు. దేశంలో మోదీ నాయకత్వంలో పెట్రేగి పోతున్న మత విద్వేష రాజకీయాలను ఎప్పటికపుడు ఎండగడుతూ ప్రజా పోరాటాలకు దిశా నిర్దేశం చేశాడన్నారు. ఆయన మరణం భారతదేశ రాజకీయాలకు తీరని లోటన్నారు. దేశ ప్రజల అభ్యున్నతి కోసం పరితపించిన సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగించడం ప్రస్తుత రాజకీయాలకు చాల అవసరం మన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బిరెడ్డి, జీఎల్.నరసింహులు, వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు జెడ్పీ శ్రీనివాసులు, ప్రజా సంఘాల నాయకులు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం నేత రాంభూపాల్

ఆర్టీసీ ఆర్ఎంకు మంత్రి మందలింపు

ధర్మవరం అర్బన్: పుట్టపర్తి, హిందూపురం, కదిరి డిపో నూతన బస్సులను అక్కడి ఎమ్మెల్యేలతో కాకుండా తనతో ప్రారంభింపజేయడంపై రాష్ట్ర రవాణాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్‌ను మందలించారు. ధర్మవరం ఆర్టీసీ డిపోలో ఆదివారం పుట్టపర్తి, హిందూపురం, కదిరి డిపో కు చెందిన నూతన బస్సులను మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సత్యకుమార్ ప్రారంభించారు. తాను ప్రైవేటు కార్యక్రమంపై ఇక్కడికి వస్తే తన మెప్పు కోసం ఇతర ప్రాంతాల బస్సులను ఎలా ప్రారంభింపజేస్తారంటూ మంత్రి ఆర్ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేబి నాగార్జున రెడ్డి, కార్యదర్శి ముస్తఫా, నాయకులు మంత్రికి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ధర్మవరం డిపోలో గతంలో తొలగించిన పల్లె వెలుగు సర్వీసులను పునరుద్ధరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు మంత్రికి విన్నవించారు.


ఆర్టీసీ ఆర్ఎంను మందలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఆర్టీఓ కార్యాలయం పరిశీలన

కదిరి టౌన్: స్థానిక ఆర్టీఓ కార్యాలయాన్ని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ధర్మవరం నుంచి రాయచోటికి వెళ్తూ మార్గమధ్యంలో ఆయన కుటాగుళ్ల వద్దనున్న ఆర్టీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఆర్టీఓ శ్రీనివాసులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ స్థలంలో నిర్మాణాన్ని ఆపించండి

ఎస్‌పీకుంట: స్థానిక పసువుల మందలోని పంచాయతీ స్థలంలో చేపడుతున్న నిర్మాణాన్ని ఆపించాలని సర్పంచ్ ఆంజినమ్మ, శ్రీరాములు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్.పి.కుంట పొలం సర్వే నంబరు 294లో గ్రామం ఏర్పడినప్పటి నుంచి పశువుల మంద ఉందని, ఇందులో 2003-04లో పంచాయతీ నిధులతో బండలపరుపు వేయించామన్నారు. క్రమేపి పశువులు తగ్గడంతో పశువుల మంద వినియోగంలో లేదన్నారు. కాగా ఇదే గ్రామానికి చెందిన పాలగిరి మహబూబ్‌బాషా అనే వ్యక్తి మండలోని ప్రభుత్వ స్థలంలో గొర్రెలు తోలుకుంటూ ఉండేవాడని, ఆ ప్రదేశంలో ఇప్పుడు శాశ్వతంగా రేకులషెడ్డు నిర్మాణం చేపట్టాడని తెలిపారు. సెలవు దినాలు అయినందున సంబంధిత అధికారులు అందుబాటులో లేరని, పోలీసులు రేకులషెడ్డు నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరారు. స్పందించిన జమేదారి నరసింహమూర్తి వీఆర్ఓతో మాట్లాడి, సంబంధిత ప్రదేశం వద్దకు వెళ్లి పనులు నిలిపి వేయించారు. స్థలానికి సంబంధించిన పత్రాలు ఉంటే మంగళవారం సంబంధిత అధికారులకు చూపించి సమస్య పరిష్కరించుకోవాలని నిర్మాణదారుడికి సూచించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గౌనిపల్లిలో సమావేశమైన పూర్వవిద్యార్థులు


పట్నం జెడ్పీహైస్కూల్‌లో కలిసిన పూర్వవిద్యార్థులు

ఓడీచెరువు: గౌనిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 1981 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు నాటి తీపి గుర్తులను నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం తంగేడుకుంటకు చెందిన పూర్వ విద్యార్థికి రూ.10 వేలు, వుగ్గిరెడ్డి పల్లి విద్యార్థికి రూ.3వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాసరెడ్డి, జనార్దన్ గుప్తా,మంజుల, రత్నకుమారి, రాజారెడ్డి, శ్రీనివాసగుప్తా, చలపతి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పాఠశాల 2012 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు నేర్పిన గురువులైన రామచంద్ర, శంకర్‌బాబు, చంద్రశేఖర్, హరినాథ్‌రెడ్డి తదితరులను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రసన్న, మౌనిక, లక్ష్మీదేవి, విజయలక్ష్మీ, అశోక్, మాలిక్, వెంకటరమణతో పాటు పలువురు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని సుభాష్ ట్యుటోరియల్‌లో 1991-92లో టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం ఐరిష్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలునేర్పిన గురువులైన భాస్కర్‌రెడ్డి, రజాక్, లక్ష్మీనారాయణరెడ్డి, బాబు, రవిని దుశ్శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు సాయి ప్రసాద్, పద్మాంజలి, నాగేంద్రకుమార్, పార్థసారథిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

ధర్మవరం అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పీఎస్‌యూ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని పీఎస్‌యూ కార్యాలయంలో ఆదివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతోందన్నారు. నేడు దేశంలో 27.7 శాతం నిరుద్యోగులు ఉన్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణను ప్రోత్సహించడం వల్ల ప్రభుత్వ సంస్థలు మూతపడి లక్షల మంది ఉద్యోగాలు కోల్పోతున్నారన్నారు. ప్రత్యేక హోదా, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, విద్యా రంగ సమస్యలపై దశలవారీ పోరాటాలు చేద్దామన్నారు. ఆర్ఎస్‌పీ సభ్యులు తిమ్మక్క, శ్రీరాములు, తిప్పన్న, వేణుగోపాల్, నరసింహులు, వెంకటరమణ, పీఎస్‌యూ నాయకులు నందకిషోర్, సాయి, భరత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

విద్యుత్ వైర్ అపహరణ

ధర్మవరం రూరల్: తుమ్మల గ్రామంలో ఆదివారం దొంగలు హల్‌చల్ చేశారు. వ్యవసాయ మోటార్లకున్న విద్యుత్ స్టార్టర్ పెట్టె, విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్లారు. వివరాలు...గ్రామానికి చెందిన రైతులు చెన్నారెడ్డి, క్రిష్టారెడ్డి, కేశవరెడ్డి, గోపాల్‌రెడ్డి, రవీంద్రారెడ్డికి చెందిన విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్లారు. ఎర్రిస్వామికి చెందిన స్టార్టర్ పెట్టెను తస్కరించారు. దీనికితోడు గ్రామంలోని రక్షిత తాగునీటి పథకంకు వున్న కేబుల్ కోసుకెళ్లారు. ఇటీవల తుమ్మలు, తిప్పేపల్లి, గొట్లూరు, సుబ్బారావుపేట గ్రామాలలో వ్యవసాయ పరికరాలను దొంగలు ఎత్తుకెళ్లిపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. పోలీసులు గస్తీ ముమ్మరం చేసి దొంగతనాలు జరుగకుండా నివారించాలని బాధితులు కోరుతున్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనం


మడకశిర మండలం బుళ్లసముద్రం ఓసీ కాలనీలో గణనాథున్ని ఊరేగిస్తున్న దృశ్యం


మడకశిర మండలం బుళ్లసముద్రం బీసీ కాలనీలోని నిమజ్జనానికి వెళ్తున్న వినాయకుడు


రొళ్లలో వినాయకున్ని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

మడకశిరరూరల్: మండలవ్యాప్తంగా ఆదివారం వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. బుళ్లసముద్రం ఓసీ, బీసీ కాలనీల్లో కొలువుదీరిన గణనాథులను ట్రాక్టర్లపై ఉంచి ఊరేగింపు చేపట్టారు. యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలతో ముందుకు సాగారు.

రొళ్ల: రొళ్ల శనేశ్వర ఆలయ ఆవరణలో కొలువుదీరిన వినాయక విగ్రహంతో పాటు దొమ్మరహట్టిలో ఆదివారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం రొళ్లలో వినాయకుడిని ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం సమీపాన బావిలోని విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. దొమ్మరహట్టి వినాయకుడిని హులికుంట చెరువులో నిమజ్జనం గావించారు.

అమరాపురం: కనకనపల్లి, అమరాపురం అంబేద్కర్ కాలనీలో ఆదివారం నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై ఉంచి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. యువతీ యువకులు డీజే పాటలకు నృత్యం చేశారు. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

మామపై అల్లుడు దాడి

కదిరి అర్బన్: యాకాలచెర్వుపల్లిలో శనివారం రాత్రి మామపై అల్లుడు కొడవలితో దాడి చేసి గాయపరిచిన సంఘటన చోటు చేసుకుంది. రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ తెలిపిన మేరకు.. యాకాల్‌చెర్వుపల్లికి చెందిన ఆంజనేయులు తన కుమార్తెను బుక్కపట్నం మండలం బిట్టువారిపల్లి చెందిన శివకుమార్‌కు ఇచ్చి వివాహం చేశాడు. కుమార్తె ప్రసవం కోసం పుట్టింటికి భర్తతో కలిసి వచ్చింది. మామ తన భార్యను గ్రామంలోని ఏదో వస్తువు తీసుకురావడానికి దుకాణానికి పంపాడని ఆగ్రహించి నిండు గర్భిణిని ఎలా పంపుతావని వాగ్వాదానికి దిగాడు. మాటా మాటా పెరిగి ఇంట్లోని కొడవలితో మామ తలపై అల్లుడు దాడి చేసి గాయపరిచాడు. కుటుంబ సభ్యులు ఆంజనేయులును కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు అల్లుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భార్యాభర్తలకు గాయాలు

తనకల్లు: గందోడివారిపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడ్డారు. వివరాలు...గద్దలబద్దతండాకు చెందిన నరసింహులునాయక్, తిమ్మమ్మ బైక్‌పై కొక్కంటిక్రాస్ వైపు నుంచి తండాకు బయలుదేరారు. అయితే గ్రామం దాటిన తరువాత రోడ్డుకు అడ్డంగా జింక రావడంతో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.